

రెహ్మత్‌నగర్‌లో పర్యటిస్తున్న నగర కమిషనర్ రోనాల్డ్ రోస్, అధికారులు

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రెహ్మత్‌నగర్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలతో కలిసి రహ్మత్‌నగర్ చౌరస్తా నుంచి కార్మికనగర్ వరకు పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రహ్మత్‌నగర్ జంక్షన్ పనులు, కార్మికనగర్ నాలా పనులు, ఎస్పీఆర్‌హిల్స్ దళిత స్టడీ సర్కిల్, సున్నం చెరువు, 100 అడుగుల రోడ్డు పనులను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెహ్మత్‌నగర్ జంక్షన్ అభివృద్ధికి రూ.4.50 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో ప్లాన్ ఆమోదం పొందడంతో మరొకసారి టౌన్‌ప్లానింగ్, పోలీస్‌శాఖ సలహాలు తీసుకుని పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్మికనగర్‌లోని ఎన్‌ఎంఎస్‌ఈ వద్దగల నాలా పనులు చేపట్టాలన్నారు. సున్నం చెరువులో చెత్తను డంపింగ్ చేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంసీ సేవాలాల్‌నాయక్, ఈఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బోరబండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు కనీసం 26 వేల వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించి అమలు చేయాలని కోరుతూ ఈ నెల 16న కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మె పిలుపునిచ్చాయి. కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయాలని బోరబండలో సీఐటీయూ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను సంఘం నాయకులు సోమవారం విడుదల చేశారు. నగేష్, సుగుణమ్మ, తులసి, నాగమణి, పుష్పలత పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



జాస్సో

బోరబండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఏజీస్టాఫ్ క్వార్టర్స్‌కు చెందిన జాస్సో(19) ఇంట్లో పిల్లల సంరక్షణకు పని చేస్తుంది. ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సమాచారం ఇవ్వకుండా ఇంటినుంచి బయకు వెళ్లింది. తిరికి రాకపోవడంతో అందోళన చెంది యజమాన్యులు వివిధ ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి

గూడూరి చెన్నారెడ్డికి బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డకు చెందిన డాక్టర్ గూడూరి చెన్నారెడ్డికి బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆయన సోమవారం ఎర్రగడ్డలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విశ్వగురు వరల్డ్ రికార్డ్ ఐఎస్ఓ సంస్థ ఫౌండర్ లయన్ డాక్టర్ సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో తనకు ఈ అవార్డు అందజేసినట్టు పేర్కొన్నారు. సంఘ సంస్కర్తగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు తనకు ఈ అవార్డును జస్టిస్ ఈవీ వేణుగోపాల్ అందజేశారన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ బీకే గూడూరి విజయలక్ష్మి, వి రాధాకృష్ణ, జి.మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు చేయూతనివ్వాలి



అనాథాశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అనాథ చిన్నారులకు అందరూ చేయూత ఇవ్వడానికి ముందుకు రావాలని జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఎర్రగడ్డ బాలాజీ స్వర్ణపురి కాలనీలోని జీవోదయ హోంఫర్ చిల్డ్రన్స్ అనాథాశ్రమానికి నిత్యవసరాలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకట శ్రీధర్, పసుపులేటి ప్రసాద్, మత్తి శ్రీనివాస్, కే.రాంబాబు, బడే విశ్వేశ్వరరావు, మట్ట శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, బి.శ్యాం ప్రసాద్, సింహాద్రి రాధాకృష్ణ, చిట్టిబాబు, ఎన్.భాస్కర్, రామకృష్ణ, ఏ.విజయ్, షేక్ మీరావలి, మహేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి



వీహెచ్‌పీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మోడల్ పాఠశాలలో విద్యార్థులను మత మార్పిడిని ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ ధర్నా చేసింది. సోమవారం సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ సంచాలకుని కార్యాలయం వద్ద విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు మెరుపు ధర్నా నిర్వహించారు. పోలీసులు వీరిని అరెస్టు చేశారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాలికలతో బొట్టు, గాజులు, కాళ్ల పట్టీలు తొలగించాలని ఆదేశాలు ఇచ్చారని వీహెచ్‌పీ రాష్ట్ర కో కన్వీనర్ సుభాష్ చందర్ ఆరోపించారు. దీనికి నిరసనగా కార్యాలయం వద్ద మెరుపు ధర్నా చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో దివాకర్, రాజశేఖర్, కరుణాకర్, శివ, సాయి, నవీన్, మహేష్, రాహుల్, ప్రవీణ్, శంకర్ ఉన్నారు.



సమావేశంలో గురుకుల జేఏసీ ప్రతినిధులు

గురుకుల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి, బదిలీలు చేపట్టాలని, ఆ తర్వాత కొత్తవారికి పోస్టింగ్ ఇవ్వాలని గురుకుల జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని అన్ని గురుకుల సంస్థలను ఒకే యాజమాన్యం కిందికి తెచ్చి ప్రభుత్వ జీవోలను అమలు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులు మామిడి నారాయణ, డాక్టర్ ఏ.మధుసూదన్, పి.రుషికేశ్‌కుమార్, వి.వి కృష్ణారెడ్డి, వి.ప్రభుదాస్, వేదాంతచారి, మాట్లాడారు. రాష్ట్రంలో 1022 ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, వీటిలో సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. సమావేశంలో డాక్టర్ పి.సత్యం, ఎస్.గణేశ్ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పెద్దమ్మతల్లి వార్షిక వేడుకలు

భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ముగ్గురమ్మల మూలపుటమ్మ.. కొలిచే వారికి కొంగు బంగారమై వరాలిచ్చే తల్లి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి. నగరంలో అత్యధిక ఆదాయం కలిగిన దేవాలయంగా చరిత్రపుటలోకి ఎక్కిన పెద్దమ్మతల్లి దర్శించుకునేందుకు భక్తులు నిత్యం వేలసంఖ్యలో వస్తుంటారు. మంగళవారం, శుక్రవారం, ఆదివారం దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. మొక్కిన పని ఇట్టే జరిగిపోతుందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా పెళ్లి కాని వారు, సంతానం లేని వారు, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అమ్మవారిని దర్శించుకుంటే వారి కోరికలు తీరుతాయనే నమకం. దివంగతనేత పి.జనార్దన్‌రెడ్డి కృషితో చిన్నగా ఉన్న ఆలయం.. నేడు పెద్ద ఆలయంగా అవతరించింది. ఇప్పుడు 30 వార్షికోత్సవాల కోసం ఆలయాలు ముస్తాభవుతుంది. రథోత్సవం, విమాన శిఖర కుంభాభిషేకం కోసం చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆలయ చరిత్ర

పౌరాణిక చరిత్ర ఆధారంగా ప్రజలను పీడిస్తున్న రాక్షసులను సంహరించడానికి వచ్చిన శక్తి స్వరూపిణి పెద్దమ్మతల్లి జూబ్లీహిల్స్‌లోని (గతంలో కొండలు గుట్టలు ఉన్న ప్రాంతం) ఈ ప్రాంతంలో గల బావి వద్ద సేదతీర్చుకోవడానికి వచ్చి అక్కడే కొలువయినట్టు పండితులు పేర్కొంటున్నారు. 1994లో హంపి శంకరాచార్యుల ఆధ్వర్యంలో బిజ్జుమల్ల సిద్ధాంతి సహకారంతో అప్పటి ఎమ్మెల్యే పీజేఆర్ ఆలయాన్ని పునః నిర్మించారు. జన సంచారం పెరగడంతో అమ్మవారి ఆలయాన్ని కూడా విస్తరించారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరిగి వారి కోరికలు తీరుతుండడంతో భక్తుల కొంగు బంగారంగా పెద్దమ్మతల్లి విరాజిల్లుతోంది.



జూబ్లీహిల్స్ కొలువుదీరిన పెద్దమ్మతల్లి



ప్రధాన మండపం

రథసప్తమి రోజు రథోత్సవం

పెద్దమ్మతల్లి ఆలయంలో నిత్యపూజలతో పాటు విశేష పూజలు కూడా జరుగుతాయి. మాఘ మాసంలో వచ్చే రథసప్తమి రోజు అమ్మవారి రథోత్సవ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. పెద్దమ్మ తల్లి విగ్రహం రథసప్తమి రోజున ప్రతిష్ఠాపన జరిగింది. దీంతో ప్రతియేటా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై వీధుల్లో ఊరేగిస్తారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడతారు. ఈనెల 16న రథోత్సవం జరుపనున్నారు. 17న పెద్దమ్మవారి ఉత్సవ మూర్తికి పుష్కరిణిలో అవభృథస్నానంతో వార్షికోత్సవాలు ముగుస్తాయి.

వార్షికోత్సవం పూజలు

ఈనెల 14న ఉదయం 3 గంటలకు పెద్దమ్మతల్లికి అభిషేకం, మంత్రపుష్పము, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణం, యాగశాల ప్రవే శం, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, వేద పారాయణము, నవగ్రహజపములు, రుద్రాభిషేకం సా యంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి పల్లకీసేవ నిర్వహిస్తారు. ఈనెల 15న మండపూజలు, వేదపారాయణము, అరుణ, పంచోపనిషత్, దేవీభాగవత, మహావిద్యా, చండీపారాయణాదులు, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చనలు జరుగుతాయి. ఈనెల 16న దిక్పాలక భైరవ బలిహరణం, హంపి పీఠాధిపతులు విద్యారణ్యస్వామి చేతుల మీదుగా విమాన శిఖర కుంభాభిషేకం నిర్వహిస్తారు.



అడోలసెంట్ హెల్త్ అకాడమీ సమావేశంలో వైద్యులు

ముగిసిన ఏహెచ్ఏ సమావేశం

● విస్తృత కౌమారదశపై అవగాహన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పీడియాట్రిక్ అసోయేషన్ ఆధ్వరంలో అడోలసెంట్ హెల్త్ అకాడమీ(ఎహెచ్ఎ) 7వ వార్షిక సమావేశం ఆదివారంతో ముగిసింది. ఈ సమావేశానికి నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, వైద్యులు జెలాలెం బిర్హాను, టాఫెస్సే తదితరులు హాజరయారు. కౌమార దశలో పిల్లలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించినట్లు అకాడమీ ఛైర్‌పర్సన్ డాక్టర్ రమేష్ బి దంపూరి తెలిపారు. 2024లో నిర్వహించనున్న కార్యక్రమాలను ఈ సదస్సులో వివరించినట్లు ఆయన చెప్పారు. అనాథశ్రాయలను దత్తత తీసుకోవడం, ప్రభుత్వ పాఠశాలలు, బాలల గృహాలు మొదలైన వాటిల్లో కౌమార ఆరోగ్య సమస్యలపై అవగాహనపై వర్క్‌షాప్‌ను నిర్వహించడం, కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. అలాగే రీచింగ్, అన్‌రీచ్డ్ ప్రోగ్రామ్‌లో భాగంగా మురికివాడలు, గ్రామాల్లో పిల్లల కౌమారదశలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోషకాహారం, లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం సమస్యలు మొదలైన వాటిపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

బోరబండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని బంజారనగర్ బస్తీ ఛైర్మన్ సన్నరాజు వెంకటేశ్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సోమవారం తెలిపారు. ఆయన వెంట పలువురు రాజీనామా చేశారు.

ఆతిథ్యరంగంలో మానవ వనరుల కొరత



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ నగరాజ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో హోటల్స్, రెస్టారెంట్స్, ఆతిథ్యరంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నా.. కోవిడ్ తరువాత మార్పు వచ్చిందని, మానవ వనరుల కొరత చాలా ఉందని తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ నగరాజ్, ఉపాధ్యక్షుడు అమేయ్ మరాతే, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎర్రమంజిల్‌లోని సంస్థ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆతిథ్యరంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు లభించడం లేదన్నారు. కోవిడ్ అనంతరం తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పులు వచ్చాయని తమ పిల్లలు ఐటీ రంగంపైనే దృష్టి పెట్టేవిధంగా చూస్తున్నారన్నారు. దీంతో ఆతిథ్య రంగంలోకి యువత రాకపోవడంతో మానవ వనరుల కొరత రోజురోజుకూ తీవ్రమవుతుందన్నారు. కొంతమంది ఈ పరిశ్రమను వదిలి వెళ్తుండగా, కొత్త వారు రావడం లేదన్నారు. ప్రపంచంలో మానవాళి ఉన్నంత వరకు హోటల్, రెస్టారెంట్, అతిథ్యరంగం ఉంటుందన్నారు. ఈ రంగంలో హెచ్చుతగ్గులు ఉండవచ్చు కానీ ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. అతిథ్యరంగం, ఫుడ్ బిజినెస్ సులభం కాదని, చాలా టఫ్‌గా ఉంటుందన్నారు. యువతకు ఈ రంగంలో అపార ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. జాబ్ రెసిషన్ లేని ఏకైక ఇండస్ట్రీ హోటల్, టూరిజం రంగాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ జారీ విధానం లోపభూయిష్టం

ఆర్టీఏ కార్యాలయాల వద్ద శిక్షణ కేంద్రాలు



డ్రైవింగ్ శిక్షణ పుస్తకాలను ప్రదర్శిస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో ఏడాదిలో రహదారి ప్రమాదాల్లో 1023 మంది మృతి చెందితే, దేశంలో 20 వేల మందికి పైగా మృతి చెందుతున్నారన్నాని, మన డ్రైవింగ్ లైసెన్స్ జారీ విధానం లోపభూయిష్టంగా ఉందని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్నారు.

డ్రైవర్ల నిర్లక్ష్యం, రహదారి నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాహనాలు నడిపే వారికి ట్రాఫిక్ ఎడ్యుకేషన్ అనేది చాలా ముఖ్యమని జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా రోడ్ క్రాఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సొసైటీ ఫర్ ఎన్విరాన్మెంట్, హెల్త్, ట్రాఫిక్ (సెహత్) అధ్యక్షుడు డాక్టర్ కేశవ్ రావు, టాప్ డ్రైవర్ ఎడ్యుకేషన్ ఎల్.ఎల్.పి అధ్యక్షుడు, రచయిత నరేష్ రాఘవన్, బ్రిగేడియర్ శ్రీరామ్, సొసైటీ కార్యదర్శి ఆదిశంకర్, కెప్టెన్ మహీర్ మాస్టర్‌లతో కలిసి బ్రిగేడియర్ మాల్కం వోల్ఫ్ మాట్లాడారు. లర్నింగ్ లైసెన్స్ తీసుకున్న తరువాత ఆర్టీఏ కార్యాలయాల వద్ద స్వచ్ఛంద సంస్థలతో కలిసి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే కాబోయే డ్రైవర్లకు రహదారి భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించవచ్చని అన్నారు. వాహనాలు నడిపే వారికి ట్రాఫిక్ ఎడ్యుకేషన్ అనేది చాలా ముఖ్యమన్నారు. మన దగ్గర నిర్లక్ష్యపు డ్రైవింగ్ చాలా ఉందన్నారు. డ్రైవింగ్ సరిగ్గా రాని వారు కూడా వివిధ మార్గాల్లో డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుని వాహనాలను అడ్డదిడ్డంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు.

పరులకు సహాయపడితే పదవి అర్థవంతం



రమణాచారి దంపతులను సన్మానిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రభుత్వ పదవులు చేపట్టి వుండవచ్చని, కానీ ఆ అధికారంలో ఉన్నప్పుడు పరులకు సహాయపడితే సార్థకత చేకూరుతుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనరెడ్డి అన్నారు. రమణాచారి వివిధ పదవుల్లో ఉన్న సమయంలో ఆయన సహకారం పొందినవారు పదవీ విరమణ చేసిన తర్వాత కూడా జన్మదిన సందర్భంలో తమ అభిమానం చూపడం అరుదైన విషయమని పేర్కొన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఐఏఎస్ అధికారి డా.కేవీ.రమణాచారి జన్మదిన వేడుకల సందర్భంగా హాస్యానందం పత్రిక ఆధ్వర్యంలో జరిగిన కార్టూన్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. చిల్ల రాజశేఖరరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, లంక లక్ష్మీనారాయణ, కృష్ణమాచార్యులు, నిర్మల, వెంకటదాసు, గుదిబండి వెంకటరెడ్డి పాల్గొన్నారు. హాస్యానందం ప్రత్యేక సంచికను సంపాదకుడు పి.రాములాంఛనంగా డా.రమణాచారికి అంకితమిచ్చారు. రమణాచారి దంపతులను జస్టిస్ శేషశయనరెడ్డి సత్కరించారు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

చందానగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరిలించారు. వారి నుంచి 760 గ్రాముల హాష్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు, చందానగర్ ఎస్ఐ శ్రీధర్ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా ఆటోలో ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వారు పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు.

'చర్లపల్లి' స్టాల్‌కు ఉత్తమ అవార్డు



మురళీబాబు, సంతోష్ కుమార్‌రాయ్‌కి అవార్డు అందజేస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు

కుషాయిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 93వ అఖిల భారత పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన-2024లో ఏర్పాటు చేసిన చర్లపల్లి జైలు స్టాల్‌కు రాష్ట్ర ప్రభుత్వ స్టాళ్ల కేటగిరీలో ఉత్తమ అవార్డు లభించింది. సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీ ఎన్.మురళీ బాబుకు మంత్రి జూపల్లి కృష్ణారావు అవార్డును అందజేశారు. పది సంవత్సరాలుగా 'మై నేషన్' పేరిట జైళ్లశాఖ ఉత్పత్తుల స్టాల్‌ను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ అవార్డు అందుకోవడం రెండోసారి అని చర్లపల్లి సూపరింటెండెంట్ ఎస్.కె.రాయ్ తెలిపారు. జైళ్లలో ఖైదీలు తయారు చేస్తున్న ఫర్నీచర్, వస్త్రాలు, శానిటరీ ఉత్పత్తులకు ప్రజాదరణ లభించడం గర్వకారణమని ఆయన అన్నారు.

173 కిలోల గంజాయి పట్టివేత

● విలువ రూ.46 లక్షలు ● ఐదుగురి అరెస్టు, పరారీలో ఆరుగురు



పట్టుబడిన గంజాయి

మహేశ్వరం/ చేవెళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, చేవెళ్ల ప్రాంతాల్లో గంజాయి ముఠాలు పట్టుబడ్డాయి. ఆ ముఠాల నుంచి రూ.46లక్షల విలువైన 173 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్ట్ చేయగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 109 కిలోల గంజాయిని మహేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.30లక్షలు ఉంటుంది. ఏపీ తూర్పు గోదావరి జిల్లా నుంచి మెదక్ జిల్లాకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా మహేశ్వరం గేటు వద్ద పట్టుకున్నట్టు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. ఆటోలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపూర్ మండలం తుమ్మలచెరువుకు చెందిన సోమ రాకేశ్‌రెడ్డి, తాటి చంటిబాబును అరెస్టు చేశారు. ఇదే కేసులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోర లోకేశ్, మెదక్ జిల్లాకు చెందిన బాణావత్ రాహుల్ పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు.

● మరో ఘటనలో అక్రమంగా తరలిస్తున్న 64 కిలోల గంజాయిని సోమవారం చేవెళ్లలో పోలీసులు పట్టుకున్నారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన చిత్ర కైలాస్ మోహిత్, నౌనాథ్ గణపత్‌చౌహన్, మాధన్ బాల సాహెబ్‌బయస్, రాజేష్ సుభాశ్‌మొహెతే, రేఖ, మనోజ్‌సింగ్‌వీ, లాము పాలాటీ ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో మహారాష్ట్రకు వెళ్లే లారీల కోసం ఎదురుచూస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి గంజాయితో పాటు ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. వారి నుంచి రూ.16 లక్షల విలువైన 64కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్రకైలాస్, నౌనాథ్ గణపత్, మాధన్‌లను రిమాండ్‌కు తరలించారు.

ఐఎంఆర్ పరిశ్రమను మూసేయాలి

పశువుల దాణా పేరుతో కల్తీ నూనె తయారీ



సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన బాధిత రైతులు, ప్రజలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామశివారులో పశువుల దాణా పరిశ్రమ నెలకొల్పుతామని చెప్పి జంతు వ్యర్థాలు, ఎముకలతో కల్తీ నూనె, పొడులు తయారు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమడుతున్న ఐఎంఆర్ ఆగ్రో ఫుడ్స్ పరిశ్రమను మూసి వేయాలని పరిసర గ్రామాలు, తండాలకు చెందిన ప్రజలు, రైతులు డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమలో నిల్వ చేస్తున్న జంతువ్యర్థాల వలన తీవ్ర దుర్వాసన వెదజల్లడమే కాకుండా క్రిమికీటకాలు తమపై దాడి చేస్తున్నాయని, వ్యవసాయ పనులు కూడా చేసుకోలేకపోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కొర్ర బాలు, రమేష్, నర్సింహ, రామస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ జంగయ్య, సూర్యనాయక్, తదితరులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అప్పారెడ్డిపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 93లో ఐఎంఆర్ ఆగ్రో ఫుడ్స్ సంస్థ పశువుల దాణా తయారు చేస్తామని చెప్పి పరిశ్రమను ఏర్పాటు చేశారన్నారు. కానీ అందులో జంతు కళేబరాలు, ఎముకలతో నూనెను తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్వాసనతో రాజీవ్‌గాంధీనగర్ తండా, గుడితండా, సర్రే తండా, కట్రామ్ తండా, కొలుకులపల్లి, మధునాపురం, పోలేపల్లి, చాటిమీది తండా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. దుర్వాసనకు వ్యవసాయ పనుల కోసం కూలీలు సైతం రావడం లేదన్నారు. తమ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని, పరిశ్రమను మూసివేయించాలని విజ్ఞప్తి చేశారు.

స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్స్



అవార్డుగ్రహీతలు, నృత్యకళాకారులతో అతిథులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోల్డెన్‌స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్ -2024 ప్రదానం కళాదీక్షితులు హాలులో జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డులు ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో నాట్యగురువులు డా.యం.క్రిష్ణప్రియ, కేఎన్.రాజేశ్వరీశ్రీధర్‌ల శిష్య బృందం తమ నృత్య ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

కరాటే, కుంగ్ ఫూలో నలంద విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన 3వ అంతర్జాతీయ ఓపెన్ టూ ఆల్ స్టైల్స్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో వెంగళరావునగర్ లోని నలంద విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, తదితర దేశాలకు చెందిన క్రీడాకారులు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. విద్యాసంస్థలకు చెందిన గౌతమ్, కీర్తన, ఖలీల్, కీర్తన్, ప్రేమ్ వర్ధన్‌లు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం నలంద విద్యాసంస్థల ఛైర్మన్ మంతెన శ్రీనివాసరాజా, డైరెక్టర్ మంతెన సూర్యనారాయణ కశ్యప్ వర్మలు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, సీనియర్ కరాటే కోచ్ జి.వి.రెడ్డి, జూనియర్ కరాటే కోచ్ మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్స్ విజేత నరసింహారెడ్డి జోడీ



పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్‌లో నంద్యాల నరసింహారెడ్డి జోడీ విజేతగా నిలిచింది. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేహెచ్ఐసీ) స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ముగిశాయి. ఇందులో 50 ప్లస్ డబుల్స్ ఫైనల్లో నరసింహారెడ్డి-వహీద్ జోడీ 10-6తో సుధాకర్ రెడ్డి-దినకర్ ద్వయంపై నెగ్గింది. 50 ప్లస్ సింగిల్స్‌లో లగడపాటి శ్రీధర్ 10-8తో వహీద్‌పై గెలిచి, టైటిల్ సొంతం చేసుకున్నాడు. సింగిల్స్ ఇతర విభాగాల్లో సూర్య (30 ప్లస్), రాజు (40 ప్లస్), రామ్‌రెడ్డి (60 ప్లస్) విజేతలుగా నిలిచారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భాస్కర్‌రావు, తదితరులు

మూర్ఛపై అపోహలు వద్దు.. అవగాహన ముఖ్యం

- అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ అనేది మెదడుకు వచ్చే సర్వ సాధారణమైన వ్యాధి బాధితులున్నారని, మూర్ఛపై అపోహలు వద్దని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు అన్నారు. అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవం సందర్భంగా కిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సును న్యూరాలజీ డాక్టర్ సీతా జయలక్ష్మి, న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిమ్స్ ఆస్పత్రిలో న్యూరాలజీకి చెందిన ప్రత్యేక వైద్యులు ఉన్నారన్నారు. అనంతరం డాక్టర్ మానస్ పాణిగ్రాహీ మాట్లాడుతూ భారతదేశంలో కోటి మందికి పైగా ఈ వ్యాధితో బాధపడుతున్నారని, మూర్ఛ అనేది చికిత్స చేయగల మెదడు వ్యాధి అని, ఇది 20 సంవత్సరాలకు ముందు 60 సంవత్సరాల తర్వాత ఎక్కువగా వస్తుందని, ఒక్క సారి వస్తేనే మూర్ఛ ఉన్నట్లు కాదని కనీసం రెండు సార్లు వస్తే అప్పుడు వైద్యులని సంప్రదించాలన్నారు. కొద్దిపాటి మూర్ఛ వచ్చినా చికిత్సలు అవసరం అవుతాయని, ఎందుకంటే వాహనాలు నడిపేటప్పుడు, ఈత కొట్టేటప్పుడు ప్రమాదమన్నారు. ఇది మందులతో కొన్ని సార్లు నయమవుతుందని, శస్త్ర చికిత్స చేస్తే దాదాపు 80 శాతం మందికి నయమవుతుందన్నారు.

వైద్య ఖర్చులకు సాయం


రూ.1 లక్ష చెక్కును అందజేస్తున్న రఘు కిరణాచార్యులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల కోసం ఓ తోటి బ్రాహ్మణుడికి రూ.1 లక్ష చెక్కును సాయంగా అందజేశామని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘు కిరణాచార్యులు అన్నారు. తుకారాం గేట్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కొండాపూర్‌లో ఉంటున్న తటపర్తి శరత్ ఆరేళ్ల కుమార్తెకు వెసిస్కోపి ఊరేటియల్ రేమిప్లాంటేషన్ వ్యాధితో బాధపడుతున్న కూతురు వైద్యానికి రూ.1 లక్ష చెక్కును అందజేశామన్నారు. ఎవరికి ఆపద వచ్చినా సేవా వాహిని సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ గ్రేటర్ కన్వీనర్ సుధాకర్‌రావు, సభ్యుడు రంఘనాథ్‌చార్యులు పాల్గొన్నారు.

జోరుగా వెలగ పండ్ల అమ్మకాలు

చిలకలగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మేలు చేసే తీపి, పులుపు రుచితో ఉండే వెలగ పండ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాలలో ఇవి లభ్యమవుతున్నాయి. ధర విషయానికి వస్తే రూ.100 నాలుగు చొప్పున అమ్మకాలు సాగిస్తున్నారు. పండిన వెలగ పండుని బెల్లంతో కలుపుకుని తింటారు. పచ్చడి కూడా చేస్తారు. సంవత్సరానికి ఒకసారి మాత్రమే వచ్చే ఈ పండ్లు మహారాష్ట్ర నుండి నిజామాబాద్‌కి వస్తాయి. అక్కడి నుండి నగరానికి సరఫరా అవుతాయి. గత సంవత్సరంతో పోలిస్తే దిగుబడి తక్కువగా ఉందని ధరలు ఎక్కువగా ఉన్నా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని వ్యాపారి భిక్షపతి తెలిపాడు.

నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం

తిరుమలగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుంకర విజయ్ అన్నారు. ఆంధ్రజ్యోతితో సోమవారం ప్రత్యేకంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్మానుష్య ప్రాంతాలను గుర్తించామని అన్నారు. ఆ ప్రాంతాల్లో ఒంటరి మహిళలు, కళాశాలల విద్యార్థులు అధికంగా వెళ్తున్న నేపథ్యంలో వారి భద్రత దృష్ట్యా సిబ్బంది ద్వారా నిఘా పెంచామని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

బైకు కారు ఢీకొని ఇద్దరికి తీవ్రమైనగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

తిరుమలగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధ దంపతులను కారు ఢీకొట్టగా వారికి తీవ్రగాయాలైన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ భగత్‌సింగ్ కాలనీకి చెందిన భిక్షపతి(72), కళావతి(70)లు భార్యాభర్తలు ఇద్దరు కలిసి తమ పెప్ స్కూటీ వాహనం మీద బయటకు పనిమీద వెళ్లి తిరిగి ఇంటికి లోతుకుంట నుండి వెళ్తుండగా రక్షణశాఖ పరిధిలోని ఆర్.ఎస్.ఎస్ సర్కిల్ వద్దకు రాగానే నేవీ హౌస్ నుండి అమ్ముగూడ వైపు స్విఫ్ట్ కారులో వెళ్తున్న దంత వైద్యురాలు రతిమా చోప్రా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కిందపడిపోయారు. భిక్షపతి కాళ్లకు గాయాలు కాగా కళావతికి తలకు గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న వారి కుమారుడు నరేష్ సంఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు ప్రథమ చికిత్స నిర్వహించారు. కళావతికి తల తిరుగుతుందని చెప్పడంతో ఆమెను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెను ఐసీయూ వార్డ్‌లో చేర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. భిక్షపతి ఆరోగ్యం నిలకడగా ఉంది. నరేష్ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ పెట్టీ కేసులో ఆరుగురికి జైలు

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ పెట్టీ కేసులో ఆరుగురిని సికింద్రాబాద్ పదమూడవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. గ్యాస్‌మండికి చెందిన మోసిన్ షరీఫ్, నవీన్‌కాంత్, రాజేష్‌యాదవ్, జోసెఫ్, మహమ్మద్ అక్బర్, మహమ్మద్ అఫ్జల్‌పై ఈ పెట్టీ కేసులు నమోదు చేసి సోమవారం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారు.

173 కిలోల గంజాయి పట్టివేత

- విలువ రూ.46 లక్షలు
- ఐదుగురి అరెస్టు, పరారీలో ఆరుగురు


పట్టుబడిన గంజాయి

మహేశ్వరం/చేవెళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, చేవెళ్ల ప్రాంతాల్లో గంజాయి ముఠాలు పట్టుబడ్డాయి. ఆ ముఠాల నుంచి రూ.46లక్షల విలువైన 173కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్ట్ చేయగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి.

శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 109 కిలోల గంజాయిని మహేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.30లక్షలు ఉంటుంది. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా నుంచి మెదక్ జిల్లాకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా మహేశ్వరం గేటు వద్ద పట్టుకున్నట్టు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. ఆటోలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపూర్ మండలం తుమ్మలచెరువుకు చెందిన సోమ రాకేశ్‌రెడ్డి, తాటి చంటిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోర లోకేశ్, మెదక్ జిల్లాకు చెందిన బాణావత్ రాహుల్ పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు.

- మరో ఘటనలో అక్రమంగా తరలిస్తున్న 64 కిలోల గంజాయిని సోమవారం చేవెళ్లలో పోలీసులు పట్టుకున్నారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన చిత్ర కైలాస్ మోహిత్, నౌనాథ్ గణపత్‌చౌహాన్, మాధన్ బాలసాహెబ్‌బయస్, రాజేష్ సుభాశ్‌మొహెతే, రేఖ, మనోజ్‌సింగ్‌వీ, లాము పాలాటీ ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో మహారాష్ట్రకు వెళ్లే లారీల కోసం ఎదురుచూస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి గంజాయితోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. వారి నుంచి రూ.16లక్షల విలువైన 64కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్రకైలాస్, నౌనాథ్ గణపత్, మాదన్‌లను రిమాండ్‌కు తరలించారు.

జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ వద్ద..

పార్కింగ్ పరేషాన్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, స్థానికులు
- వాహనాలను తొలగించాలని విజ్ఞప్తి


జామై ఉస్మానియా- ఆర్ట్స్‌కాలేజీ ప్రధాన రహదారి పక్కన పార్క్ చేసిన వాహనాలు


రైల్వే స్టేషన్ వద్ద అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలు

బౌద్ధనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లోని జామై ఉస్మానియా రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాలు వాహనాల అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ఇక్కడ అక్రమ పార్కింగ్ చేయడంతో ప్రమాదాలతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది డ్రైవర్లు ఇక్కడ వాహనాలను ఇష్టారాజ్యంగా నెలలు తరబడి పార్కింగ్ చేస్తున్నా పట్టించుకున్నవారే లేరు. రైల్వేస్టేషన్ ఎదుట వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నా అటు రైల్వే అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు వాహనాల అక్రమ పార్కింగ్‌పై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేసినా, వాహనాలను తొలగించాలని వార్నింగ్ ఇచ్చినా డ్రైవర్లకు, వాహన యజమానులకు భయం లేకుండా పోయింది. జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వందలాదిమంది ఉద్యోగులు, కళాశాలల విద్యార్థులు, వ్యాపారులు ఎంఎంటీఎస్ ద్వారా నగరంలో వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. వాహనాలు అడ్డుగా ఉండటంతో రైల్వేస్టేషన్ లోపలికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతుంటారు. స్టేషన్‌కు బయట ఆర్టీసీ బస్టాండ్ ఉండటం, వాహనాల పార్కింగ్‌తో బస్సులను రోడ్డుపైన ఆపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో ఈ ప్రాంతంలో రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి కాల్చిన సంఘటనలున్నాయి.

ప్రతిసోమవారం సంత.. ట్రాఫిక్ జామ్..

జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ వద్ద ఒక పక్క వాహనాలను అక్రమ పార్కింగ్ చేస్తుంటే.. ప్రతి సోమవారం ఈ ప్రాంతంలో మధ్యాహ్నం రెండుగంటల నుంచి రాత్రి పదకొండు గంటల వరకు సంత మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. రోడ్డుకిరువైపులా కూరగాయల బండ్లు పెట్టడంతో పాటు, వాహనాల పార్కింగ్‌తో బస్సులు, పెద్దవాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. సంతమార్కెట్‌ను రోడ్డుపక్కన కాకుండా మరోచోటుకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

యాభై ట్రాక్టర్లకు పైగా అక్రమ పార్కింగ్..

జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ వద్ద సుమారు యాభై పైగా ట్రాక్టర్లతో పాటు ఇతర వాహనాలను అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్లు రోడ్డుకు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వీటిల్లో బిల్డింగ్ మెటీరియల్‌కు సంబంధించిన మిషిన్లను ఇక్కడ పార్కింగ్ చేస్తున్నారు. జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ నుంచి వారాసిగూడ మార్గంలో సుమారు అర కిలోమీటర్ వరకు రోడ్డుకిరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని పలు ఫిర్యాదులు చేసినా ట్రాఫిక్ పోలీసులు తూతూ మంత్రంగా చలానాలు రాసి వెళ్తున్నారని స్థానికవాసులు వాపోతున్నారు.

వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు



వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు పడుతున్నాం. కనీసం రైల్వేస్టేషన్ ఎదుట టూ వీలర్ పార్కింగ్‌చేయటానికి వీలులేకుండా ట్రాక్టర్లు, ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. రోడ్డుకిరువైపులా వాహనాల పార్కింగ్‌తో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

\- నవీన్‌కుమార్, వారాసిగూడ

శబ్ద కాలుష్యం



ట్రాక్టర్ల వలన విపరీతమైన పొగ వచ్చి శబ్ద కాలుష్యం తలెత్తుతోంది. మూడు సంవత్సరాల నుంచి అధికసంఖ్యలో జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ వద్ద వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని వాహనాలైతే నెలల తరబడి ఉంటున్నాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి రైల్వేస్టేషన్ వద్ద అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలి.

\- మధు, బౌద్ధనగర్

బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న నల్లగొండ లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పార్టీ నా యకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజలాల పరిరక్షణ, కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగించడానికి వ్యతిరేఖంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ హాజరవుతారని చెప్పారు. 13వ తేదీ ఉదయం 9గంటలకు మారేడ్‌పల్లిలోని మున్సిపల్ గ్రౌండ్‌కు చేరుకోవాలని, అక్కడి నుంచి ర్యాలీగా నల్లగొండ సభకు బయలు దేరనున్నట్లు చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, లలితాచౌహాన్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, నాయకులు బాల్‌రెడ్డి, హన్మంతరావు, గుర్రం పవన్ కుమార్ గౌడ్, వెంకటేషన్ రాజు, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, తలసాని మహేష్‌యాదవ్, ధర్మేంద్ర యాదవ్, ప్నైలాబ్ యాదవ్, అశోక్‌యాదవ్, శ్రీహరి, సంతోష్, కిషోర్, మహేష్, ఆరీఫ్, శ్రీకాంత్‌రెడ్డి, రామ్‌నివాస్‌బన్సాలీ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


ముత్యాలమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తూ తీసుకువెళ్తున్న భక్తులు

బోయినపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ 1వ వార్డులోని బోయినపల్లి బాపూజీనగర్‌లో గల పురాతన ముత్యాలమ్మ ఆలయాన్ని పునఃనిర్మించారు. నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయ విగ్రహాన్ని తమిళనాడులోని మహాబలిపురం నుండి తెప్పించారు. ఈ నేపథ్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, ఆలయ ఛైర్మన్ జంపన ప్రతాప్, ఆలయ ప్రెసిడెంట్ దుర్గయ్య, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి 14 వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నూతన విగ్రహాన్ని బాపూజీనగర్ వీధులలో మంగళ వాయిద్యాలతో ఊరేగిస్తూ ఆలయంలోకి తీసుకువచ్చారు. అనంతరం మహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుమాధవ్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, పుణ్యాహవచనం, హోమం, అఖండదీప స్థాపన, కలశస్థాపన నిర్వహించారు. మంగళవారం ఉదయం నుండి హోమాలు, ప్రత్యేక పూజలు, అగ్నిప్రతిష్ఠ నిర్వహిస్తారు. బుధవారం వేదమంత్రాలు, బలిహారం, ద్వారపూజలు, మండప దేవత పూజలు, మంగళవాయిద్యాలతో నూతన విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేసి ప్రత్యేక అలంకరణ మహా హారతులు, అనంతరం అమ్మవారిని భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రెసిడెంట్ దుర్గయ్య తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కనులార తిలకించి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

ఘనంగా బోయినపల్లి గణేష్ ఆలయ బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక పూజలు చేస్తున్న జగద్గురు పుష్పగిరి శంకరాచార్యులు

బోయినపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లిలోని కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు బావనకాలనీలోని శ్రీగణేష్ ఆలయ 26వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 10 నుంచి 12 వరకు ఘనంగా ఆలయ సేవా సమితి సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, విశేష హోమాలు, యాగాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిసాయి. ఈ ముగింపు వేడుకలకు జగద్గురు పుష్పగిరి శంకరాచార్యులు హాజరై ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని కనులారా వీక్షించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఉదయం నిత్యకైంకర్యాల అనంతరం సహస్ర నామార్చన నిత్యార్చన నిర్వహించిన అనంతరం మండపంలో స్వామివారికి అమ్మవారికి మహాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు గణపతి, శివపార్వతులను పల్లకీపై భావనకాలనీ వీధుల్లో భక్తులను ఆశీర్వదించారు. తద్వారా మహాహారతి వేద పండితుల ఆశీర్వచనాలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించిన తర్వాత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపత్ రాజ్ జైన్, సత్తెయ్య, దుర్గారెడ్డి, యాదగిరి, బీజేపీ నాయకుడు బానుక మల్లికార్జున్ పాల్గొన్నారు.


మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావుతో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు

ద.మ.రై. ఉద్యోగుల సహకార పరపతి పరిమితి సంఘం అధ్యక్షుడిగా చిలుకు స్వామి

- సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నిక

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమితి సంఘం అధ్యక్షులుగా చిలుకు స్వామి, ఉపాధ్యక్షులుగా రామ్మోహన్‌రావు ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో ఆఫీస్ బేరర్‌లకు సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. ఎన్నికల తేదీ నుంచి 5 సంవత్సరాలు పదవిలో ఉంటారని తెలిపారు. 2023 అక్టోబర్ 10,12 తేదీలలో ఎన్నికలు నిర్వహించగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల నుంచి షేర్ హోల్డర్లుగా ఉన్న 44,000 మంది రైల్వే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నవంబర్ 23వ తేదీన 210 మంది డెలిగేట్‌ల ఎన్నిక జరిగింది. తర్వాత 21 బోర్డు ఆఫ్ డైరెక్టర్‌లను ఎన్నుకున్నారు. 45 రోజుల నుంచి 2 నెలల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవలసి ఉండగా కోర్టు కేసుల నేపథ్యంలో జాప్యం జరిగింది. కోర్టు తీర్పు వెలువడటంతో ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు, జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

సెల్ ఫోన్ దొంగల అరెస్ట్

బోయినపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై సంచరిస్తూ నడుచుకుంటూ వెళ్లేవారి వద్ద నుంచి సెల్ ఫోన్‌లను దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న నిందితులను బోయినపల్లి పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హస్మత్‌పేట్ హరిజన బస్తీకి చెందిన మక్కాల వినయ్‌కుమార్ అలియాస్ వినయ్(21) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. హస్మత్‌పేట్‌కు చెందిన పోవర్ కృష్ణ(21) ఓ ప్రైవేట్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వినయ్ తన స్నేహితులైన కృష్ణ, శంకర్, సాగర్‌లతో కలిసి రాత్రిపూట ద్విచక్ర వాహనాలపై కాలనీలలో తిరుగుతూ నడుచుకుంటూ వెళ్తున్న వారి సెల్‌ఫోన్లను టార్గెట్ చేస్తుంటారు. ఈ క్రమంలో నడుచుకుంటూ వెళ్లే వారిని టార్గెట్ చేసుకొని వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను కొట్టేస్తూ అక్కడి నుంచి పారిపోతారు. ఒకవేళ బాధితులు అడ్డుకుంటే వాళ్లపైన దాడిచేసి మరీ బెదిరిస్తూ వెళ్లిపోతారు. ఈ క్రమంలో బీహార్ నుంచి వచ్చి రెండు సంవత్సరాలుగా ఓల్డ్ బోయినపల్లిలో నివాసముంటున్న రాకేష్‌కుమార్ స్థానికంగా ఉన్న హల్దీరామ్స్ సంస్థలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. రోజులాగే ఈ నెల 9న రాకేష్‌కుమార్ తన తోటి ఉద్యోగులు రాంసుందర్‌యాదవ్, కిషన్, పాశ్వాన్‌లతో కలిసి అర్ధరాత్రి ప్రాంతంలో తాము పనిచేస్తున్న హల్దీరామ్ కంపెనీ నుంచి పని ముగించుకుని కాలినడకన వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరు మహాలక్ష్మీ ఎంపోరియం వద్దకు రాగానే ద్విచక్రవాహనంపై వచ్చిన నిందితులు మక్కాల వినోద్, కృష్ణలు బాధితుడిని సమయం అడిగారు. వాళ్లకు టైమ్ ఎంతవుతుందో చెప్పడానికి బాధితుడు తన జేబులో నుంచి సెల్‌ఫోన్ తీయగానే నిందితులు దాన్ని తీసుకొని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించి పరారీలో ఉన్న శంకర్, సాగర్‌ల కోసం గాలింపు చర్యలను చేపట్టారు.


అవార్డుగ్రహీతలు, నృత్యకళాకారులతో అతిథులు, నిర్వాహకులు

స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్స్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోల్డెన్‌స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్-2024 ప్రదానం కళాదీక్షితులు హాలులో జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డులు ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో నాట్యగురువులు డా.యం.క్రిష్ణప్రియ, కేఎస్.రాజేశ్వరీ శ్రీధర్‌ల శిష్య బృందం తమ నృత్య ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

రైళ్లను సకాలంలో నడిపేందుకు నిరంతర పర్యవేక్షణ

- రైల్వేజోనల్ అధికారులతో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైళ్లను సకాలంలో నడిపేందుకు పిట్‌లైన్ పని తీరుపై నిరంతర పర్యవేక్షణ అవసరమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. రైళ్లు సురక్షితంగా గమ్యం చేరడానికి అవసరమైన ముందస్తు చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సోమవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో అదనపు జీఎం ఆర్.ధనంజయులుతో కలిసి జైన్ రైల్వే శాఖల అధికారులు, డివిజనల్ మేనేజర్‌లు(డీఆర్ఎంలు)తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైళ్ల భద్రత, పరిశుభ్రత చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ రైలు కార్యకలాపాల్లో నిమగ్నమైన లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్లు తదితర సహచర సిబ్బందికి క్రమం తప్పకుండా భద్రతపై కౌన్సెలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. దీనితోపాటు రన్నింగ్ సిబ్బంది కుటుంబ సభ్యుల ఫిర్యాదులను సైతం పరిశీలించేందుకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. దీంతో రైళ్ల కార్యకలాపాలు సురక్షితంగా నడపడానికి అవకాశం ఉంటుందన్నారు. జోన్‌లో పొగను గుర్తించే పరికరాలను, అగ్నిమాపక సామగ్రి తదితర భద్రతకు సంబంధించి అందుబాటులో ఉన్న వస్తుసామగ్రిపై అధికారులు తెలియజేశారు. కాగా అనుకోని ప్రతికూల పరిస్థితులు ఎదురైనచో అత్యవసర సామగ్రిని డిపోల్లో సరిపడా నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైళ్ల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈసందర్భంగా ట్రాక్ పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు నిర్వహణకు సంబంధించిన భద్రతా పనులను చేపడుతున్నప్పుడు తీసుకోవాల్సిన అన్ని భద్రతాపరమైన జాగ్రత్తలను పాటించాలని డీఆర్ఎంలను ఆదేశించారు. ట్రాక్‌ను సరైన రీతిలో వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా ప్రయాణికుల రవాణా - సరుకు రవాణా విభాగంలో అత్యుత్తమ ఉత్పత్తిని సాధించడానికి, రైళ్ల వేగాన్ని అనుకున్న రీతిలో నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు శిక్షణ

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు రూపొందించిన మార్గదర్శకాలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు, రోడ్డు సేఫ్టీ అధికారులు సోమవారం ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ పర్యవేక్షణలో నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ సర్వీసెస్, ఐఐటీ మద్రాస్ కలిసి ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఆర్ఏడీ)ని రూపొందించారు. ఈ అప్లికేషన్‌ను అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాల్లోని మరణాలను 50 శాతం తగ్గించడమే లక్షంగా అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, హైవే, ఆరోగ్యం, మోటార్ యాక్సిడెంట్ క్లెయిం ట్రిబ్యునల్, ఇన్సూరెన్స్, లీగల్ సర్వీసెస్ కలిసి పనిచేస్తాయి. డిస్ట్రిక్ట్ రోల్ అవుట్ మేనేజర్లు అమీర్ అలీ, సతీష్ ఈ అప్లికేషన్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ డీసీపీ ఎల్‌సీ నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.గురవయ్య, ఎస్ఐ శ్వేతతో పాటు ఇతర సిబ్బంది ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.